క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నజీర్అహ్మద్

పులివెందుల టౌన్ : రాష్ట్ర ఎన్నికల కమిషన్, జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పులివెందుల మండలంలోని 73 పోలింగ్ కేంద్రాల పరిధిలోని పోలింగ్ స్టేషన్లను మంగళవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాలలో మౌళిక వసతులు, పేర్లలో ఏమన్నా తప్పులున్న వాటిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1200 ఓటర్ల కంటే ఎక్కువ ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజన కొరకు పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేయడం జరిగిందన్నారు. శిథిలావస్థకు చేరిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వాటిని కొత్త భవనాలలో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ షేక్షావలి, రెవెన్యూ సిబ్బంది కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అల్పాహారం



అనాథ వృద్ధులకు అల్పాహారం వడ్డిస్తున్న సురేష్ కుటుంబ సభ్యులు

వేంపల్లె : గండిరోడ్డులోని మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు మంగళవారం ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారు. వేంపల్లెకు చెందిన తరిగొండ సురేష్ తన కుమార్తె విష్ణుప్రియ పుట్టినరోజు సందర్భంగా అల్పాహారం ఏర్పాటు చేశారు. అలాగే వృద్ధుల మధ్య తమ కుమార్తె పుట్టినరోజు వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీవల్లిదేవసేన సమేత శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి

వేంపల్లె : స్థానిక గాండ్ల వీధిలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయ వంశపారంపర్య అర్చకులు శేషగిరిరావు నేతృత్వంలో స్వామి అమ్మవార్లకు అభిషేకం, మంత్రాపుష్పం, నైవేద్యం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధి సింగనమల సాంబశివుడు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన రైల్వే చార్జీలను ఉపసంహరించుకోవాలి



స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారం మోపేవిధంగా ఉన్న రైల్వే చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ మాస్టర్‌కు పెంచిన చార్జీలను తగ్గించాలంటూ వినతిత్రపం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం కిలోమీటరుకు పైసా పెంచడం వల్ల దూర ప్రాంతాలు వెళ్లేప్రయాణికులపై అదనపు భారం పడుతుందన్నారు. రైల్వేస్టేషన్‌లలో కనీస మౌలిక సదుపాయాలు లేకుండానే కేంద్రం చార్జీలను పెంచడం అన్యాయం అన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంతో పాటు వచ్చిన ప్రయాణికులకు ఎక్కడ మరుగుదొడ్లు, తాగునీరు లేదన్నారు. ప్రయాణికులకు వెయిటింగ్ రూంలు వంటి కనీస సౌకర్యాలు కల్పించకుండా చార్జీలను పెంచడం ఎమిటని ప్రశ్నించారు.

వైభవంగా ఆరాధన మహోత్సవాలు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో ఉన్న శ్రీసద్గురు సమర్థనారాయణ స్వామి ఆశ్రమంలో మంగళవారం 35వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, కలశస్థాపన చేసి భక్తులందరికి మహా సంకల్పం చేయించారు. అనంతరం శ్రీప్రతాపమారుతి స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. చండీ పారాయణం, జప పారాయణం, అర్చనలు, అగ్నిప్రతిష్ట, వివిధ అభిషేకాలు నిర్వహించి మహా నివేదన, మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పూజలు నిర్వహించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకుడు గోపాల స్వామి భక్తులను ఆశీర్వదించారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ఉచితం మాటున యథేచ్ఛగా తరలింపు
- రెవెన్యూ అధికారులు పట్టుకున్నా.. రాత్రికే మాయం అవుతున్న ట్రాక్టర్లు



రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

జమ్మలమడుగు : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక విధానం.. అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. స్థానిక అవసరాలకు పెన్నానది నుంచి ఇసుక ఉచితంగా తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. ఇదే అదనుగా ట్రాక్టర్ యజమానులు భారీ లోడ్లతో జిల్లా దాటించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గత కొంత కాలంగా నంద్యాల జిల్లాలోని ఆళ్లగడ్డ ప్రాంతాలకు ఎక్కువగా తరలించి అమ్ముకాలు కొనసాగిస్తున్నారు. ట్రాలీలో ఎక్కువ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌లను.. రెవెన్యూ అధికారులు పట్టుకునే ప్రయత్నం చేస్తున్నా ట్రాక్టర్ యజమానులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం తమకు ఉచితంగా ఇసుక ఇస్తోంది.. మీకేమిటి అభ్యంతరం అంటూ రెవెన్యూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. పైగా తాము ఇంటి నిర్మాణం కోసమే ఈ ఇసుకను తీసుకుపోతున్నామంటూ వితండ వాదం చేస్తున్నారు. మీ ఇసుక కూపన్లు చూపాలని అంటున్నా.. ఆవేమి మా దగ్గర లేవు మీరేమి చేస్తారంటూ ఎదురు తిరుగుతున్నట్లు తెలుస్తోంది.

రెవెన్యూ అధికారుల పేరు చెప్పి.. వసూళ్లు

ఇసుక అక్రమంగా తరలిపోతోందంటూ ఫిర్యాదులు వస్తుండటంతో.. రెవెన్యూ అధికారులు దాడులకు పాల్పడుతున్నారు. అయితే ఇటీవల కాలంలో అధికారులు ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకువచ్చారు. రెవెన్యూ అధికారులతో ట్రాక్టర్ డ్రైవర్లు గొడవలకు దిగడంతో మొత్తం 14 ట్రాక్టర్‌లను తహశీల్దార్ కార్యాలయ వెనుక వైపు పెట్టించారు. అయితే తెల్లవారే సరికి మొత్తం ట్రాక్టర్లు మాయమైపోయాయి.

ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లు నకిలీ బీగాలను తెచ్చుకుని తమ ట్రాక్టర్‌లను తీసుకుపోయారు. దీంతో అధికారులు సైతం ఈ విషయాన్ని ఎక్కడా బయటికి పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. ఇసుక ట్రాక్టర్లను తీసుకు వచ్చినా తామేమి చేయలేని స్థితిలో ఉన్నామంటూ ఆ అధికారులు వాపోతున్నారు. పోలీసుల సహకారం లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని తెలుపుతున్నారు. అంతేకాకుండా దొంగలు ఒక్క అడుగు ముందుకు వేసి తాము రెవెన్యూ అధికారులమంటూ ఇసుక ట్రాక్టర్‌ల వద్దకు వెళ్లి డబ్బులు గుంజుతున్నారు. కొంత మంది ఫోన్‌లో తమ పై అధికారితో మాట్లాడాలని ట్రాక్టర్ డ్రైవర్‌ల ద్వారా మాముళ్లు వసూలు చేసుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలియడంతో తాము ఎవరి నుంచి డబ్బులు వసూలు చేయడం లేదని, తమ పేరు చెప్పి డబ్బులు వసూలు చేయడం దుర్మార్గమంటూ వాపోతున్నారు.

ఆదుకోకుంటే.. ఆత్మహత్యలే శరణ్యం



డీటీ జ్యోతికి వినతిపత్రం ఇస్తున్న రైతులు

కమలాపురం : ఆరు గాలం కష్టించి పండించిన పంటలను వ్యాపారులు దోచేశారు. దిగుబడులు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతున్న వ్యాపారుల నుంచి తమకు డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యం అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోగటం తదితర గ్రామాలకు చెందిన రైతుల నుంచి సతీష్, జిలానీ బాషా, యాకీన్ బాషా తదితర వ్యాపారులు నాలుగేళ్ల క్రితం శనగలు కొనుగోలు చేశారు. దాదాపు 30 మంది రైతులకు సతీష్ అనే వ్యాపారి రూ. 2.40 కోట్లు, యాకీన్ బాషా రూ.4 కోట్లు, జిలానీ బాషా రూ.30 లక్షలు కలిపి దాదాపు రూ.7 కోట్ల వరకు డబ్బులు ఇవ్వాల్సి ఉంది. రైతులు ఎంత అడిగినప్పటికి వ్యాపారులు ఇదిగో, అదిగో అంటూ కాలయాపన చేశారు. రైతులందరూ కలసికట్టుగా వ్యాపారులను నిలేశారు. దీంతో వ్యాపారులు రైతులకు బాండ్లు రాసిచ్చారు. ప్రస్తుతం వారు ఇళ్లకు తాళాలు వేయడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. మంగళవారం రైతులందరూ తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లి డీటీ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. తమకు వ్యాపారుల నుంచి డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని, లేని పక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యం అని వెంకటసుబ్బారెడ్డి, బషీరా, వెంకటలక్షుమ్మ తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా నరకయాతన అనుభవిస్తున్నామని, ప్రభుత్వ పెద్దలు, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.

మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, హెచ్ఎం

వేంపల్లె : రాబోవు పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈఓ వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పాములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ వెంకటరామిరెడ్డి తనిఖీ చేసి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిందని, 2025-26 సంవత్సరంలోనైనా వంద శాతం ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసి విద్యార్థులకు విద్యా బోధన చేయాలన్నారు. విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలను తనిఖీ చేసి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంకిత భావంతో విద్యార్థులకు బోధించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ గల ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ఉత్తీర్ణత శాతం తగ్గుతోందన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులను ముందు వరుసలో కూర్చొబెట్టి వారికి విద్యా బోధన చేయాలన్నారు. క్రమశిక్షణ అనేది ప్రతి విద్యార్థిలో అలవర్చుకునే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం పాములూరు పాఠశాల నుంచి బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులను ఎంఈఓ శాలువాలతో సత్కరించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి



భవికేంద్ర విద్యార్థులతో డాక్టర్లు షాహీన్, ఎస్.ఎఫ్.బాషా, తదితరులు

వేంపల్లె : విభిన్న ప్రతిభావంతులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని డాక్టర్ షాహీన్ తెలిపారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల చిన్నారులకు డాక్టర్ షాహీన్ ఆధ్వర్యంలో అతిథి భోజనం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ వైద్యులు డాక్టర్ ఎస్.ఎఫ్.బాషాను ఎంఇఓ వెంకటరామిరెడ్డి, భవిత కేంద్రం సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల చిన్నారులను తల్లిదండ్రులు భవిత కేంద్రానికి పంపి విద్యను నేర్పించాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు కూడా అత్మస్థైర్యంతో ముందడుగు వేసి ఆయా రంగాల్లో రాణించాలన్నారు. డాక్టర్ ఎస్.ఎఫ్.బాష మాట్లాడుతూ చదువుకు అంగవైకల్యం అనేది అడ్డు రాదని, కాబట్టి విద్య పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విభిన్న ప్రతిభావంతులకు సహకరించిన దాత, సహాయకులకు ఎంఇఓ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఈఆర్టీలు యశోధ, సుజాత, ఎంఇఓ-2 స్టాలిన్ ఐజాక్, పాఠశాలల హెచ్ఎంలు ఆంజనేయులు, ప్రసాద్, ఫిజియోథెరఫిస్ట్ ఆనంద్, సిజివి సుజాత, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఓబుళనాయునిపల్లెలో పర్యటించిన వైద్య బృందం



ఓబుళనాయునిపల్లెలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వాణి

చక్రాయపేట : మండలంలోని ఓబుళనాయునిపల్లెలో మంగళవారం వైద్య బృందం పర్యటించింది. జ్వరాలతో వణుకుతున్న ఓబుళనాయునిపల్లె శీర్షికన మంగళవారం 'సాక్షి' దినపత్రికలో వార్త వెలువడింది. ఇందుకు స్పందించిన చక్రాయపేట వైద్యాధికారిణి వాణి ఆధ్వర్యంలో వైద్య బృందం గ్రామంలో పర్యటించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్త నమూనాలు సేకరించి ఇంజక్షన్‌లు, మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులను సమావేశ పరచి జ్వరం వస్తే నేరుగా ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు రావాలని బయట ప్రాంతాల్లోని ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దని తెలిపారు. ఆసుపత్రిలో అన్నిరకాల పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమలు ఎక్కువ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడేని పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వేణుగోపాల్, సబ్ యూనిట్ అధికారి ఎంపీవీ ప్రసాద్, ఎంపీహెచ్ఏ యంగయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి నాయుడు, ఏఎన్ఎం నవనీత, ఎంఎల్‌హెచ్‌పీ మునీర, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

పవన విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు భూముల పరిశీలన



భూముల కేటాయింపుపై చర్చిస్తున్న ఆర్డీవో

ముద్దనూరు : పవన విద్యుత్ టవర్లు (గాలిమరలు) ఏర్పాటుకు అవసరమైన భూములను ఆర్డీవో సాయిశ్రీ మంగళవారం పరిశీలించారు. తహసీల్దారు అలీఖాన్, డిప్యూటీ తహసీల్దారు వరద కిషోర్‌రెడ్డిలతో కలసి ఆమె మండలంలోని బొందలకుంట, యామవరం, చింతకుంట గ్రామాలకు చెందిన భూములను పరిశీలించారు. యామవరం సమీపంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన భూములను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు, విద్యార్థుల భోజనశాల, నిర్మాణంలో వున్న పాఠశాల అదనపు గదులను ఆమె పరిశీలించి విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు.

తాగునీటికి రూ.50లక్షల నిధులు విడుదల చేయాలి

వేంపల్లె : పులివెందుల పట్టణానికి తాగునీటి పనుల కోసం రూ.50 లక్షల నిధులు విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధృవ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నగరానికి తాగునీటి పనుల కోసం రూ.65 కోట్ల ప్రతిపాదనలు పంపగా, రూ.15 కోట్లు మాత్రమే మంజూరు చేశారని, మిగిలిన రూ.50 కోట్లు కూడా కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. పులివెందుల పురపాలక సంఘ పరిధిలో తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధుల కింద రూ.65కోట్లు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్లియర్ వాటర్ సంప్, పంప్ హౌస్, పంప్ సెట్లు, క్లియర్ వాటర్ ఫీడర్, 3800 కెఎల్ సామర్థ్యం ఉన్న ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూషన్ మెయిన్లు నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. 2024 మార్చి 24న ప్రభుత్వం జీఓ 344 విడుదల చేసిన ప్రకారం కేవలం రూ.15 కోట్లు మాత్రమే మంజూరు చేసిందన్నారు. పులివెందుల ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

దోమకాటుతో ప్రాణాంతక వ్యాధులు

పులివెందుల రూరల్ : దోమకాటువలన ప్రాణాంతక వ్యాధులు వస్తాయని పీహెచ్‌సీ డాక్టర్ శాంతికుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని భాకరాపురం, జయమ్మ కాలనీలలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య ఆధ్వర్యంలో దోమకాటువల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతికుమార్ మాట్లాడుతూ దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ రాత్రి సమయాలలో దోమ తెరలు వాడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పనికిరాని ప్లాస్టిక్ సామాన్లు, గాజు సీసాలు ఇంటి పరిసరాలను దూరంగా ఉంచాలన్నారు.

బంగారు దుకాణాలపై విజిలెన్స్ దాడులు

వేంపల్లె : స్థానిక బంగారు దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ సీఐ నాయకుల నారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గాంధీ రోడ్డులోని కొన్ని బంగారు దుకాణాలను తనిఖీ చేయడంతో మిగిలిన బంగారు దుకాణాలు, వస్త్ర దుకాణాలు కూడా మూసివేశారు. పట్టణంలో మొత్తం 42 బంగారు దుకాణాలు ఉన్నాయి. దుకాణాల తనిఖీల్లో చాలా అవకతవకలు ఉన్నాయని తెలిసింది. బంగారానికి సంబంధించి సరైన బిల్లులు, తూకాలు లేవని తనిఖీల్లో తెలిసింది. దీంతో బంగారు దుకాణదారులు వారి అవకతవకలను కప్పిపుచ్చుకోవడానికి ఒక్కొక్క దుకాణం నుంచి కొంత మొత్తాన్ని సేకరించి అధికారులకు డబ్బు ముట్టచెప్పినట్లు సమాచారం. కార్యక్రమంలో సిబ్బంది గీతావాణి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ జోలికి వెళ్లొద్దు



ఫ్యాక్షన్ నాయకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌చార్జి సీఐ హాజీవలి

లింగాల : మండలంలోని అంబకపల్లె, కోమన్నూతల, పార్నపల్లె, గుణకణపల్లె ఫ్యాక్షన్ గ్రామాల్లో ఇన్‌చార్జి సీఐ హాజీవల్లి మంగళవారం పర్యటించి ఫ్యాక్షన్ నాయకులకు, వారి అనుచరులకు నిర్వహించిన సమావేశంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఫ్యాక్షన్ జోలికి వెళ్లవద్దని, ఫ్యాక్షన్ జోలికి వెళితే కఠినమైన పోలీసు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ పిల్లల చదువుల కోసం, వారి అభివృద్ధి కోసం కృషి చేయాలని, చిన్న, చిన్న సమస్యలకు ఫ్యాక్షన్ వైపు వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో లింగాల పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి చేతి బోరుకు మరమ్మతులు

వేంపల్లె : స్థానిక పుల్లయ్య వీధిలో ఉన్న తాగునీటి చేతి బోరుకు అధికారులు మరమ్మతులు చేయించారు. స్థానిక గండి రోడ్డులో ఉన్న పుల్లయ్య తోట వీధిలో గత కొద్ది రోజులుగా తాగునీటి చేతి బోరు పని చేయకుండాపోయింది. ఆ ప్రాంతంలో నీటి ఇబ్బందులు ఉండటంతో అ ప్రాంత ప్రజలు చేతి బోరును మరమ్మతులు చేయించాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లి బోరుకు మరమ్మతులు చేయించాంచారు.

రాష్ట్ర క్రైస్తవుల ఆత్మగౌరవ పోరాటాన్ని గుర్తించాలి

వేంపల్లె : షెడ్యూల్డ్ కులాల, హిందూమతం నుంచి క్రైస్తవంలోకి మారిన తాము రిజర్వేషన్లు వదులుకుని బీసీసీ, మైనార్టీ క్రైస్తవులుగా జీవిస్తున్నామని, అయినా ఏ ప్రభుత్వంలోనూ, ఏ రాజకీయ పార్టీలోనూ తమకు న్యాయం జరగడంలేదని శారోన్ మెడికల్ అడ్వాన్స్‌మెంట్, రిలీఫ్ ట్రస్ట్ చైర్మన్ పండింటి డేవిడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల నుంచి క్రైస్తవంలోకి మారినప్పటికి క్రైస్తవులుగా గత 70 ఏళ్లుగా ఓటు బ్యాంకుగానే మిగిలిపోయారని, రాజకీయ పార్టీలు గుర్తించని వ్యక్తులుగా సమాజంలో మిగిలిపోయామన్నారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా అప్పటి కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల నుంచి క్రైస్తవంలోకి మారిన వారిని బీసీసీలుగా మార్చిందని, క్రైస్తవులకు స్వేచ్ఛగా సువార్తను ప్రకటించుకునే అవకాశం కల్పించాలన్నారు. క్రైస్తవులకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులు ఇవ్వాలన్నారు. బీసీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలకు 5 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు చేసి భవనాలు నిర్మించుకునేందుకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

దివ్యాంగులకు దుప్పట్లు వితరణ

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో మంగళవారం వస్త్ర వ్యాపారి దివంగత టీవీ సుబ్బారావు జయంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు సుగుణాకర్, చంద్రశేఖర్‌లు దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఆవోపా కార్యవర్గ సభ్యులు, లెక్చరర్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వాలు గుర్తించాలి



నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

పులివెందుల రూరల్ : డ్రైవర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని సేఫ్టీ డ్రైవర్ ఆసోసియేషన్ వ్యవస్థాపకులు అన్వర్‌బాషా తెలిపారు. మంగళవారం పట్టణంలోని జీపుల స్టాండ్ ఆవరణలో జోడో యాత్రలో భాగంగా డ్రైవర్లతో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. డ్రైవర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. అనేక సమస్యలపై డ్రైవర్లందరూ ఒక తాటిపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సేఫ్టీ డ్రైవర్ ఆసోసియేషన్ రాయలసీమ ఇన్‌చార్జి రామకృష్ణయాదవ్ మాట్లాడుతూ ట్యాక్సీ డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంవల్ల క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లందరూ రోడ్లమీద పడతారన్నారు. అలాగే వాహనాలకు గ్రీన్ ట్యాక్స్, రోడ్డు ట్యాక్స్, టోల్ గేట్లు వంటివిచాలా భారంగా మారాయన్నారు. కార్యక్రమంలో ఆసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బసిరెడ్డి, డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

పోరుమామిళ్ల: మండలంలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు జూలై 4వ తేదీ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ఫండమెంటల్స్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

తక్కువ పెట్టుబడులతో చిరుధాన్యాల పంటల సాగు



వేములలో చిరుధాన్యాలపై మహిళా రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త ప్రశాంతి



పులివెందుల : జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న మాస్టర్, ఏఓ



లింగాలలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ, రైతులు

వేముల : చిరుధాన్య పంటలను తక్కువ పెట్టుబడులతో సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చునని ఎరువాక కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ అంకయ్యకుమార్, డాక్టర్ ప్రశాంతిలు తెలిపారు. మంగళవారం మండలంలోని చాగలేరు గ్రామంలో కడప ఎరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్య పంటలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ పరిస్థితులు ఏమైనప్పటికి చిరుధాన్య పంటలు తక్కువ పెట్టుబడితో పండించే పంటలన్నారు. ఈ పంటలను వర్షాధారం కింద కూడా సాగు చేసుకోవాలన్నారు. చిరు ధాన్య పంటలలో పురుగు, తెగుళ్ల ఉధృతి తక్కువగా ఉంటుందన్నారు. చిరు ధాన్యాల రకాలు, ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ అన్ని వయస్సుల వారు చిరుధాన్యాల వినియోగాన్ని తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా బీపీ, డయాబెటీస్‌ల నియంత్రణ, ఎముకల ఆరోగ్యానికి మంచిదన్నారు. చిరుధాన్యాల నిల్వ, జోడింపును ఉపయోగించి చిన్న తరహా వ్యాపారాలపై రైతులకు వివరించారు. వ్యవసాయ పనిముట్ల వాడకం, యాంత్రీకరణ ఆవశ్యకత, వ్యవసాయంలో డ్రోన్ల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాల రాయితీపై రైతులకు వివరించారు. జొన్నలతో బిస్కెట్లు ఎలా తయారు చేయాలో మహిళా రైతులకు వివరించారు. అనంతరం ఏడీపీఏలు ప్రాజెక్టర్ సాయంతో చిరుధాన్యాలతో వివిధ వంటకాల తయారీ గురించి మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ అర్జున, ఏఈఓ సురేష్, ఎంపీఈఓ లక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

కమలాపురంలో



కమలాపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : రైతులు తాము సాగు చేసుకునే పంట పొలాల్లో సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎర్రగుడిపాడు, పందిళ్లపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు తదితర అంశాలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, తద్వారా తగిన మోతాదులో ఎరువులు వాడటంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. విత్తన శుద్ధి చేయడం వలన పైరుని తొలిదశలో వైరస్ తెగుళ్లు, రసం పీల్చే పురుగుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. వేరు శనగ పంటలో సూక్ష్మధాతు లోప నివారణ, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన పంటలు పండించాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తన శుద్ధి చేసేందుకు బీజామృతం తయారీని డెమో ద్వారా తెలియజేశారు. జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టల వాడకము, కషాయాల తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పులివెందులలో

పులివెందుల రూరల్ : అరటి పొలంలో మొక్కకు కావాల్సిన పోషకాల కోసం జీవామృతం తయారు చేసుకోవాలని.. జీవామృతం మొక్కకు ప్రాణమని మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రబల్లె రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చెన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలో ప్రారంభిస్తారన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి మూడు విడతలలో రూ.20వేలు రైతుల అకౌంట్లలో జమ చేయడం ఈ పథక ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ జీవామృతం తయారీ గురించి అక్కడే డెమో చేసి రైతులకు చూపించారు. కార్యక్రమంలో మోడల్ మేకర్ యామిని లత, డిజిటల్ సుబహాన్, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లింగాలలో

లింగాల : పత్తి పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి రమేష్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని కామసముద్రం, రామాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రమేష్ క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అలాగే గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జి హరితకుమారి, రైతులు పాల్గొన్నారు.